సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ


మొదటి బహుమతి సాధించిన విద్యార్థులతో క్విజ్‌మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉద్యోగార్థులకు వివిధ పరీక్షల పాఠ్యాంశాలపై బుధవారం లైబ్రరీలో క్విజ్ పోటీ నిర్వహించారు. వర్తమాన అంశాలతోపాటు గ్రూప్ 2 మెయిన్స్ సిలబస్ ఆధారంగా వివిధ సబ్జెక్టులపై పోటీ జరిగింది. 60 మంది విద్యార్థులు ఏడు బృందాలుగా పాల్గొన్నారు. ఏడు రౌండ్లలో జరిగిన పోటీలో విజేతలకు పుస్తకాలను బహుమతిగా ప్రదానం చేశారు. గ్రంథాలయం సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. గ్రంథపాలకురాలు దుర్గారాణి పర్యవేక్షించారు.

51వ వార్డు కార్పొరేటర్‌కు సత్కారం


కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణను సత్కరిస్తున్న కాలనీ పెద్దలు

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఇటీవల 51వ వార్డు నరసింహనగర్‌లో సామాజిక భవనం అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసింహనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేసి ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కంచరపాలెం: మహనీయుల అడుగుజాడల్లో పేదలకు పట్టెడన్నం పెట్టడమే వారికి నిజమైన నివాళులర్పించడమని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకల్లో భాగంగా కంచరపాలెం దళిత సేన ఆధ్వర్యంలో బుధవారం అన్నార్తులకు ఆకలి తీర్చే కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ రహదారిలో అనాథలకు ముఖ్య అతిథి అప్పారావు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పుచ్చ కామేశ్వరరావు, తాటిపూడి సీతారామ్, చింతల మల్లికార్జునరావు, లంకా రామారావు, పట్నాల ఝాన్సీ, గొల్లమాల మీనా, రాంజీ అభ్యుదయ సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు సాంబమూర్తి ఏసీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, వీసెజ్ జేడీసీ రోషిని అపరంజి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోర్టులో ఆధునికీకరించిన సాంబమూర్తి ఆడిటోరియాన్ని డా.అంగముత్తు ప్రారంభించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం 4లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. మరణించిన వ్యక్తికి సుమారు 35–45 ఏళ్ల వయసు, 5 అడుగులు ఎత్తు, చామన చాయ రంగులో తెల్లని కట్ బనియన్, నేరేడు రంగు లోయర్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. ఈ వ్యక్తి గురించి ఎవరికైనా తెలిస్తే విశాఖ రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 46వ వార్డులో రూ.6.05 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శాంతినగర్‌లో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 46వ వార్డు శాంతినగర్, కస్తూరినగర్ కొండవాలు ప్రాంతాల్లో బుధవారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.6.05 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈఈ మత్స్యరాజు తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయలతో కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామని చెప్పారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం దిశగా జగనన్న చర్యలు చేపడుతున్నారన్నారు. కటుమూరి సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలే తన కుటుంబ సభ్యులుగా భావించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

'ఎల్లో మీడియా కథనాలను ప్రజలు నమ్మరు'

ఇటీవల కాలంలో అభివృద్ధిపై దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా కథనాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని కె.కె.రాజు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుంటే.. ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం సహజమేనని, అటువంటి ప్రచారాలపై ప్రజలు ఘాటుగానే స్పందిస్తున్నారన్నారు. ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు అప్పారావు, రామారావు, గోవింద్, కృష్ణ, రాజు, నారాయణరెడ్డి, రమణ, చిన్నా, లావణ్య, అప్పలరెడ్డి, బొట్టా రాజు, కోదండం, దేవి, విజయలక్ష్మి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం

- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి


రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, బొత్స ఝాన్సీ

ఆరిలోవ: మహిళల ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం గురజాడ కళా క్షేత్రంలో వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కిమ్స్, మెడికవర్ సంయుక్తంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 375 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎంపీ, పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని అందుబాటులో ఉండేలా వార్డుల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా నైట్ షెల్టర్లు అయిన టీఎస్సార్ కాంప్లెక్స్, భూపేష్‌నగర్, పెదవాల్తేరులో రెడ్‌క్రాస్ సొసైటీకి మూడు వాటర్ ఫిల్టర్లు అందజేశారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వైవీవీ సుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియాని శ్రీధర్, కట్టమూరి సతీష్, పార్టీ ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, మెప్మా ఎండీ విజయలక్ష్మి, జీవీఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పాపునాయుడు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నూకాంబికా ఉత్సవాలకు ఏర్పాట్లు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు బర్మా క్యాంప్‌లో వెలసిన నూకాంబికా అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లక్ష్మీనగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ప్రారంభమై ఏప్రిల్ 8తో ఉత్సవాలు ముగుస్తాయని ఆయన చెప్పారు. ఉత్సవ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ నెల 20న ఉదయం 9.10గంటలకు ఉత్సవాలకు ఉడుపురాట వేస్తారు. పాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా 25న ఉదయం 6 గంటలకు అమ్మవారికి క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. 30న కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 8న సాయంత్రం అగ్నిగుండం ప్రవేశం ఉంటుంది.

15న బహిరంగ సభ

మద్రిపాలెం: ప్రగతిశీలా మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంలో భాగంగా వారి హక్కుల కోసం చేస్తున్న పోరాటాలకు ఈ నెల 15న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రోహిణిదేవి దేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆర్ అండ్ బీ దరి ఏకలవ్య కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటా బయటా మహిళలకు రక్షణ కరువైందని, మహిళా సాధికారత కోసం మాట్లాడే నాయకులు మహిళలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. మహిళలపై దాడులను ఖండించాలని, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనాలని, ఈ మేరకు నిర్వహించిన ర్యాలీలో వారికి అవగాహన కల్పించారు.

పేదల వైద్యానికి సీఎం చేయూత


బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేద, మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 22 మంది లబ్ధిదారులకు రూ.22.27 లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. సాంకేతిక లోపాలతో ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొందలేని పేదలకు చేయూతనిచ్చేలా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో సీఎం వైఎస్ జగన్ సేవలు ప్రజలకు ఎంతైనా అవసరముందని, వాటిని గుర్తుంచుకొని తమ ఆశీస్సులు జగనన్నకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సారిపల్లి గోవింద్, పి.ఉషశ్రీ, కె.వి.ఎస్.శశికళ, జేసీఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం పదిలం


వాకర్స్ క్లబ్ సభ్యత్వాన్ని అందిస్తున్న చంద్రమౌళి

మురళీనగర్: ప్రజల్లో నడక ప్రాధాన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వాకర్స్ పార్కులో సందర్శకులను ఆయన ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు కలిసి ఆరోగ్యం కాపాడుకోవడానికి ప్రతి రోజూ నడవాలని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. వాకర్స్ క్లబ్‌లో వీలైనంత మంది సభ్యులను చేర్చడం ద్వారా 'ఆరోగ్యం కోసం నడక' అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చంద్రమౌళి తెలిపారు. పలువురు వాకర్స్ క్లబ్ సభ్యత్వాన్ని స్వీకరించారు.

'ఆరోగ్య సురక్ష'తో పేదలకు మేలు


మందులు అందిస్తున్న వైద్యాధికారి మన్‌మోహన్

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్షలాది మందికి ఉపయోగపడుతోందని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మన్‌మోహన్ అన్నారు. 24వ వార్డు రేసపువానిపాలెం ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సుమారు 235 మంది స్థానికులు వివిధ వైద్య, రక్త పరీక్షలు, బీపీ, సుగర్ టెస్ట్‌లు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది పేషెంట్లకు వైద్య సేవలందించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మన్‌మోహన్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.లక్షల మందికి రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలందిస్తున్నారన్నారు. ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి (దొండపర్తి), ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ ఫారాలు పరిష్కరిస్తాం

మహారాణిపేట: ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎటువంటి పెండింగ్ ఫారాలు లేకుండా తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ ఎ.మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. పెండింగ్ దరఖాస్తులు, ఎపిక్ కార్డుల తయారు, ముద్రణ, డెలివరీ, ఎన్నికలకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తలపై తీసుకున్న చర్యలు, ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బుధవారం కలెక్టర్లు, ఎస్పీలతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి ఎటువంటి ఫారాలు పెండింగ్‌లో ఉండకూడదని, ఆ రోజు నుంచి ఎటువంటి చేరికలు, తొలగింపులు చేయవద్దని కలెక్టర్లకు సీఈవో స్పష్టం చేశారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో 20,635 వరకు ఫారం 6, 7, 8లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి పూర్తి చేస్తామన్నారు. ఐదు లక్షల ఎపిక్ కార్డులకు గానూ 4.8 లక్షల కార్డులు జిల్లాకు చేరాయని, తపాలా శాఖ ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. ఏడు ఫిర్యాదులకు గానూ ఐదు పరిష్కరించామని వివరించారు. జేసీ కె.మయూర్ అశోక్, జాయింట్ సీపీ ఫకీరప్ప, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఈఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి బాపూజీనగర్ 11కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు బాపూజీనగర్, కోదండ రామాలయం వీధి ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

జీవీఎంసీ ఏఈపై ఫిర్యాదు

సీతమ్మధార: మ్యాట్రిక్స్ సంస్థకు చెందిన రూ.85 వేలు విలువ చేసే సామగ్రిని ధ్వంసం చేశారంటూ జీవీఎంసీ ఏఈపై సంస్థ ప్రతినిధి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం మ్యాట్రిక్స్ సెక్యూరిటీస్ అండ్ సర్వేలెన్స్ సంస్థ ఆరేళ్ల కిందట 80 ఫీట్ రోడ్డులో పలు చోట్ల సీసీ కెమెరాలు, స్తంభాలను ఏర్పాటు చేసింది. రూ.85 వేలు విలువైన రెండు స్తంభాలకు సంబంధించిన ఎనిమిది కెమెరాలతోపాటు సామగ్రిని ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ అర్చన ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారని మ్యాట్రిక్స్ సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వార్డుల్లో అడిషనల్ కమిషనర్ పర్యటన


సత్యసాయినగర్‌లో పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45, 46 వార్డుల్లో బుధవారం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ పర్యటించారు. సింగాలమ్మపురం, సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జోన్ –5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, టీపీవో విజయ్‌కుమార్, డీఈ భరణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి విస్తరణ పనులు


సీతమ్మధారలో తొలగించిన రెవెన్యూ క్వార్టర్స్ ప్రహరీ

సీతమ్మధార: నగరాభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలి వరకు రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ క్వార్టర్స్‌ను ఖాళీ చేయాలని నివాసులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. బుధవారం రెవెన్యూ క్వార్టర్స్ ప్రహరీ గోడలు తొలగించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పొక్లెయిన్‌తో పనులు ప్రారంభించారు. రోడ్డుపైకి వచ్చిన గోడలు తొలగించే కార్యక్రమం చేపట్టారు.

400 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పోలీస్ స్టేషన్ పరిధిలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా... పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా.. మంగళవారం అర్ధరాత్రి సుమారు 400 కేజీల పీడీఎస్ రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తున్న క్రమంలో బిర్లా జంక్షన్ వద్ద పట్టుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వేళ.. వెలవెల

- వార్డుల్లో వెలుస్తున్న బీజేపీ కార్యాలయాలు
- రోజుల వ్యవధిలో ప్రారంభాలు
- ఎవరూ లేక నిర్మానుష్యం


50వ వార్డులో మంగళవారం ప్రారంభమైన బీజేపీ ఎన్నికల కార్యాలయం


53వ వార్డులో మూసి ఉన్న బీజేపీ ఎలక్షన్ ఆఫీస్

మద్రిపాలెం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ప్రతిపక్షాలు వార్డుల్లో ఏర్పాటు చేస్తున్న పార్టీ కార్యాలయాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ముఖ్యంగా బీజేపీ వార్డు కార్యాలయాల పరిస్థితి ఉంచలేం.. తీసేయలేం అన్న చందంగా మారింది.

2024 ఎన్నికల్లో భాగంగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు నానా హడావుడి చేస్తున్నారని నియోజకవర్గ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. జీవీఎంసీ 50, 51, 53 వార్డుల్లో రోజుల వ్యవధిలో పార్టీ కార్యాలయాలు ప్రారంభవడం.. గంటల వ్యవధిలో నిర్మానుష్యంగా మారడంతో స్థానికులు ముక్కున వేలేసుకునే పరిస్థితి నెలకొంది. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన విష్ణుకుమార్‌రాజు గత ఎన్నికల్లో ఆయన పరాజయం చవిచూశారు. అప్పటి నుంచి స్తబ్దంగా ఉన్న ఆయన ఇటీవల 49వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని మొదలెట్టేశారు. 2019లో ప్రారంభించిన బీజేపీ వార్డు కార్యాలయాలు ఎన్నికలైన వెంటనే మూతపడ్డాయి. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో విష్ణుకుమార్‌రాజు నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు ఆయా వార్డుల్లో విస్తృతంగా వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల 51వ వార్డు కళింగనగర్ వద్ద ప్రారంభించిన కార్యాలయం బోసిపోతోంది. 50వ వార్డు మురళీనగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయం గంటల వ్యవధిలోనే నిర్మానుష్యంగా మారడంపై పలువురిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ప్రజలను మభ్యపెట్టేందుకే..

గత ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన గంటా శ్రీనివాసరావు నాటి నుంచి నేటి వరకు కనీసం కనిపించలేదని, పార్టీ నాయకులను సైతం పట్టించుకోలేదని విమర్శలున్నాయి. గత ఎన్నికల్లో ఓటమిపాలైన విష్ణుకుమార్‌రాజు మళ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఇప్పుడు ప్రజలు గుర్తుకొచ్చారా.. అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అయోమయ స్థితిలో నాయకులు

బుధవారం ఉదయం 53వ వార్డు హౌస్సింగ్‌నగర్ సర్వీస్ రోడ్డును ఆనుకుని ఓ మేడపై బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మచ్చుకైనా టీడీపీ, జనసేన నాయకులు హాజరు కాకపోవడం గమనార్హం. ఇదే ప్రాంతంలో 2014 ఎన్నికల పొత్తు నేపథ్యంలో టీడీపీ సహాయంతో ఎక్కువగా బీజేపీకి ఆదరణ లభించిందని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇన్విటేషన్ మీద కనీసం తమ పార్టీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు ఫొటో కూడా లేకపోవడంతో కొందరు విసుక్కున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఫొటో ఉన్నప్పటికీ ఆ పార్టీ వారికి కూడా సమాచారం లేదనడంతో వారంతా దూరంగా ఉన్నట్టు తెలిసింది.

ఈ-శ్రమ్ నమోదుపై అవగాహన


ఈ-శ్రమ్ దరఖాస్తులు అందిస్తున్న సంయుక్త కార్మిక కమిషనర్ గణేషన్

సీతంపేట: కార్మికులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, తమ వివరాలను ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఆదూరి గణేషన్ తెలిపారు. పరవాడ ఎన్‌టీపీసీలో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికులు చేస్తున్న పనికి తగినట్టు భద్రతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా వారి బ్యాంకు ఖాతాకు చేరేలా ఈ–శ్రమ్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. మీ సేవా కార్యాలయంలోని, సచివాలయంలో గాని నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కార్మిక కమిషనర్ విశాఖపట్నం జి.రాజు, మధురవాడ అసిస్టెంట్ కార్మిక కమిషనర్ ఆర్.రమాదేవి, ఎన్‌టీపీసీ అడిషనల్ జనరల్ మేనేజర్ భక్తవత్సల పాత్ర, హెచ్‌ఆర్ మహాపాత్రో, సిబ్బంది, కాంట్రాక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్లు

కంచరపాలెం: కంచరపాలెం ఆర్పీ పేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధవారం టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మనసును ప్రశాంతంగా ఉంచుకుని పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పేరెంట్ కమిటీ చైర్మన్ మళ్ల రమేష్‌గౌరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేదాల సారం రామాయణం


ప్రసంగిస్తున్న సాహితీవేత్త టి.పి.ఎన్.ఆచార్యులు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సాహితీ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త టి.పి.ఎన్.ఆచార్యులు 'వేదసారం రామాయణం' అనే అంశంపై ప్రసంగించారు. రామాయణంలోని రసరమ్య ఘట్టాలను, రామ అనే అంశంపై, రామనామ మహిమపై అద్భుత ప్రసంగం చేశారు. రావణ కాష్టం, సీతాదేవి జన్మ విశేషాలను వివరించారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వేదాల సారాన్ని రామాయణ మహాకావ్యంగా రచించి భారతీయ సంస్కృతికి మూలస్తంభమై వాల్మీకి నిలిచాడన్నారు. రామాయణం మానవ జీవిత పథనిర్దేశం చేసే మహాకావ్యంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, సూరపనేని విజయ్‌కుమార్, డి.వి.సూర్యారావు, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ, అయ్యల సోమయాజుల ప్రసాద్, రామతాత తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి కేఏ పాల్‌ను పార్లమెంట్‌కు పంపుదాం

సినీ నటుడు బాబూమోహన్



మీడియాతో మాట్లాడుతున్న బాబూమోహన్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి కేఏ పాల్‌ను పార్లమెంట్‌కు పంపి.. జిల్లా, రాష్ట్ర, దేశ సమస్యలపై ప్రశ్నించే అవకాశం కల్పిద్దామని మాజీ ఎమ్మెల్యే, సినీ నటుడు బాబూమోహన్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఏ పాల్, ఆయన అన్న డేవిడ్‌రాజులతో తనకు 30 ఏళ్ల నుంచి అనుబంధం ఉందని, ఈ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరఫున ప్రచారం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తనను కాకినాడ లేదా గాజువాకల నుంచి పోటీ చేయమని కేఏ పాల్ కోరారని, తాను అందుకు సిద్ధంగా లేనని తెలియజేశానన్నారు. బీజేపీ తనను మోసం చేసిందని, ఆ ఘటనతో ఇక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాకూడదని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కేఏ పాల్‌కు ప్రపంచ దేశాధినేతలతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ మధ్య కాలంలో స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే పరిస్థితి వస్తే తాను కొంటానని కూడా ఆయన అన్నారని బాబూమోహన్ గుర్తుచేశారు. త్వరలోనే పార్టీ విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని, ఇది ప్రారంభం మాత్రమేనన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు ఎన్నాళ్ల నుంచో నడుస్తోందని, ఇప్పుడది బహిర్గతమైందని చెప్పారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com